# ఆర్థిక సూత్రం

నర్సిగాడు మోసుకొచ్చిన వార్త ఊళ్ళో ఉన్న జనాల్నీ పెద్దల్నీ ఆశ్చర్యంలో ముంచివేసింది.

అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

కలికాలం అని వాపోయారు.

మన ఇంటా వంటా లేదు....

అసలీ గ్రామంలోనే ఇటువంటిది అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చూసినా జరగలేదన్నారు.

ఎంకిగాడిపై ఊరు దుమ్మెత్తిపోసింది.

"ఒరే ఎంకిగా- యిదేంపనిరా? ఛీ! మనిషి జన్మ ఎత్తలేదట్రా! థూ!" రెడ్డిగారు ఉమ్మేశారు.

"నువ్వు చేసిన పనికి దేవుడు నిన్ను నరకానికికాదు నరకం కంటే హేయమైన లోకాన్ని సృష్టించి పంపి స్తాడురా ఎంకిగా!" పూజారి నొక్కి వక్కాణించాడు.

"మొగజనమ కాదురా నీది?!" కరణం... మాజీ కరణం సందేహించాడు.

"ఒరే ఒరే ఎంకినాయాలా! భలే పనిచేశావురా! వాడినిమటుకు నీ దగ్గర ఎందుకుంచుకున్నావు?" సెట్టి బొంగురు గొంతుకతో బుడతడిని చూపిస్తూ అడిగాడు.

మోకాళ్ళల్లో తల దూర్చుకుని కూర్చున్నాడు ఎంకిగాడు. వాడిపక్కనే నాలుగేళ్ల కొడుకు కూర్చొని అమాయకంగా అందరినీ చూస్తున్నాడు.

"ఒరే! అలా ముంగిలా కూచుంటే ఊరుకుంటామనుకున్నావా! సంజాయిషీ చెప్పు! ఈ ఊరికే మచ్చ తెచ్చావు?" రెడ్డిగారు దబాయించారు.

"మచ్చ... అమ్మమ్మో! అలా తేలిగ్గా అనేస్తారేమిటి... ఫలానా గ్రామస్తులమని చెబితే మలుగురూ మొహాన ఉమ్మేస్తారు...." పూజారి పిలక ముడేసుకుంటూ అన్నాడు.

"ఎదవ పని చెయ్యడానికి పొరుగూరే దొరికిందిరా ఎదవ? అదేదో యిక్కడసేసుంటే మన ఊరి పరువు పొలిమేరలు దాటేది కాదు"సెట్టిగుటకలుమింగుతూ చెప్పాడు.

"ఏ ఊరు పోయినా తల ఎత్తుకోలేక పోతున్నా!" మాజీ కరణం వాడు చేసిన పనికి రాజీ పడడంలేదు.

"అయ్యా! ఎందుకే నిన్ను ఈళ్ళు తిడుతున్నారు?" బుడతడు తన చిట్టిచేతుల్తో తడుముతూ అడిగాడు.

తల ఎత్తకుండా ఏడుస్తూ ఉండిపోయాడు ఎంకిగాడు.

"ఊళ్ళో ఎంకమ్మ కనిపించకపోతే పుట్టింటికి పంపిచావనుకున్నాను... కాని" రెడ్డి.

"మీరనుకోవడమేమిటి? వీడునాతో అలానే చెప్పాడు" పూజారి సరిచేశాడు.

"మంచం మీద పడుందనుకున్నా!" కరణం వక్ర భాష్యం.

"రోజా సరుకులు కొచ్చేది రాకపోయేసరికి అంగడి మార్చిందనుకున్నా!" సెట్టి.

ఎంకిగాడికి ఆవేశం తన్నుకొచ్చింది. పైకి లేచాడు రౌద్రంగా. "నా పెళ్ళాం-నా యిష్టం! ఎళ్లి మీపన్లు సూసుకోండి"బుడతడిని సంకనేసుకుని వెళుతూ చీదరగా అన్నాడు.

"ఏందీ? నీ పెళ్ళాం - నీ యిష్టమా! పూజారి!చూడు! ఎల్లాంటి కాలం వచ్చిందో చూడు. ఇంక అన్నీ వాడిష్టమైతే ఊరి పెద్దలం మనం ఎందుకట!" రెడ్డిగారు కోపంగా అన్నారు.

"పిదప కాలం, పిదపాబుద్ధులు!" పూజారి పెదవి విరిచాడు.

"వెనకటికెవరో నాగుడిసె నేతగలెట్టుకుంటా మీకెందుకంటా అంటూ- చుట్టూతా గుడిసెల మధ్య ఉన్న తన గుడిసెకు నిప్పంటించాడట!" సెట్టి బలబలబలాడాడు.

వెనకాల వస్తున్న పెద్దల్ని లెక్క చెయ్యకుండా ఎంకడు గుడిసె దగ్గరకు వచ్చాడు.

"రేయ్! ఎంకిగా! ఆగు! సాయంత్రానికల్లా నీ పెళ్ళాన్ని నువ్వు తెచ్చుకుని ఏలుకోకపోతే..." రెడ్డి కఠినంగా శాసించాడు.

"ఏం చేస్తారేటి?" ఎంకిగాడు ఎదురు తిరిగాడు.

"చెప్పం...చేసి చూపిస్తాం!" మాజీ కరణం లౌక్యం ప్రదర్శించాడు.

"మీరేంచేసినాఅదిరాదు.నాకూదానికిరుణంతీరిపోయింది"వేదాంతిలాసెలవిచ్చాడుఎంకిగాడు.

"ఎందుకు రాదు?" పూజారి వంకర నవ్వు.

"అమ్మేశాను కాబట్టి", నిదానంగా అన్నాడు... "మూడువేల రూపాయలకమ్మేశాను కాబట్టి."వాడు అంత కుండ బద్దలు కొట్టినట్లు చెబుతూ ఉంటే నలుగురూ అవాక్కయ్యారు.

"హూ! ఈ రోజు మీరంతా నా దగ్గరికి వచ్చారు. నేను నా భార్యని అమ్ముకున్నానని... అది తప్పని మీ పెద్దరికం చూపిస్తున్నారు. కాని నెలలు, నెలలు పస్తులతో కాపురం చేస్తున్నాం. అప్పుడు వచ్చారా? ఓ చిన్నపని యిప్పించమని మీ అందరిచుట్టూ తిరిగా అప్పుడు నన్ను పట్టించుకున్నారా? ఆఖరికి బుడతడికి కూడా కాసిని గంజి నీళ్ళుపోసే అధరువులేక అమ్మేశాను ఎంకమ్మని. తప్పా?" నిలదీశాడు ఎంకిగాడు.

ఆ అవిధేయతకు రెడ్డిగారికి కోపం వచ్చింది. సాచి లెంపకాయ కొట్టాడు. బలహీనంగా ఎండిపోయిన డొక్కలతో ఉన్న ఎంకిగాడు కిందపడ్డాడు.

"ఒరే ఎదవ సచ్చినోడా! పెళ్ళి చేసుకుంది... పెళ్ళాన్ని అమ్మేసేయటానికి కాదురా!"

"ఎంకిగా! నాతి చరామి అని ఆమెకు తాళికట్టావుకదా! కష్టాల్లో, సుఖాల్లో ఆమెకు తోడుగా ఉంటాన్నావు కదురా? రెండు ఆత్మల్నిమమేకం చేసేది పెళ్ళిరా! అంత పవిత్రమైన పెళ్ళి చేసుకుని... దాన్ని ఎలా అమ్మావురా."? పూజారి ఆవేదన.

"బాబూ! నాకే ధర్మ పన్నాగాలు తెలియవండి... నాకు తెలిసనదల్లా కాలే కడుపు... ఇంకొన్నాళ్ళు అది నా దగ్గరుంటే ఆకలిసావుసస్తుందండి..." ఎంకిగాడు లేచి ఏడుస్తూ చెప్పాడు... కారే కన్నీళ్ళను తుడుచుకోకుండా.

"ఛ!ఛ! మొగాడివై ఉండి ఏడుస్తున్నావురా? ఆకలి శాశ్వతంరా వెధవా!" మాజీకరణం.

"ఏమో బాబూ! ఆత్మశాశ్వతమో కాదో కానీ-కానీ మా బీదోళ్ళకి మటుకు ఆకలి శాశ్వతమండి..." ఎంకిగాడు చెప్పాడు.

"ఛీ! పెళ్ళానికి పట్టెడు మెతుకులు పెట్టలేనిది నీదేం జన్మరా"! సెట్టి చీదరగా అన్నాడు.

"అయిందేదో అయిపోయింది... ఎంకిగా... సాయంత్రానికల్లా దాన్ని మాకు తెచ్చి చూపాలి! ఎంకమ్మను నువ్వే ఏలుకోవాలి ! జాగ్రత్త! సాయంత్రం వస్తా!" రెడ్డిగారు హుకుం జారీ చేశారు.

ఆ ఊళ్ళో రెడ్డిగారి ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ!

సాయంత్రం రచ్చబండ దగ్గర సమావేశమయ్యారు నలుగురూ. ఎంకిగాడు, బుడతడిని, ఎంకమ్మని తీసుకొచ్చాడు. రెడ్డిగారు అభయమిస్తున్నట్లు నవ్వారు ఆమెను చూస్తూ. "ఎంకమ్మా! నీకేం భయంలేదు... ఈరోజు నుంచి ఈడి దగ్గరే ఉండు? అయినా నీకెలా సిగ్గులేకపోయిందేపోడానికి"? మాజీకరణం అడిగాడు.

ఆమెను నఖశిఖ పర్యంతం చూస్తూ "కండ పట్టింది"... సెట్టి అన్నాడు.

"అదికాదు ఎంకమ్మా! తాళి కట్టింది ఈడు. ఈడిని కాదని పోలయ్య దగ్గరకు ఎలా

వెళ్ళావు? ఒకసారి హిందూ స్త్రీ పెళ్ళిచేసుకుంటే జీవితమంతా వాడి దగ్గరే ఉంటుంది! అత్తారింటినుంచి వెళ్ళేది శవమేనే!" పూజారి అన్నాడు.

ఎంకిగాడు ఏడుస్తూ ఆమెకేసి చూశాడు. బుడతడు ఆమె కొంగు పట్టుకున్నాడు.

"ఒసే ఎంకమ్మా! ఈళ్ళు నన్ను ఎలేసినట్టు చూస్తున్నారే! పోలయ్య డుడ్డులు పోలయ్యకిచ్చేస్తా.. ఈ రోజు నుంచి నువ్వు నా దగ్గరికే వచ్చెయ్యి..." ఎంకిగాడు అన్నాడు.

"అమ్మా! నన్నొదిలిఎళ్ళకే!" బుడతడు.

"అలా దారికి రా! ఊ! ఎంకమ్మా! నువ్వు నీ గుడిసెకుపో.. పోలయ్యతో మేం చెపుతాం!" రెడ్డిగారు అన్నారు.

"అయ్యా! నేను పోలయ్య దగ్గరే ఉంటా!" రెండు చేతులు జోడిస్తూ చెప్పింది."ఎంకిగాడిని సేసుకుని నేనేం సుఖపడల్లేదు... ఏనాడూ కడుపు నిండేది కాదు... పోలయ్యా మస్తుగా తినిపిస్తున్నాడు. నన్ను బాగా సూసుకుంటున్నాడు.

అందుకే బుడతడిని.... ఎంకిమావను వదిలేసి వెళుతున్నా! ఇందులో ఆడిని తప్పుపట్టాల్సిన పనిలేదు." ఏడుస్తూ దండం పెట్టింది ఎంకమ్మ.

ఊరిపెద్దలు ముక్కుమీద వేలేసుకున్నారు. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు.

మహిళ ఆంధ్రప్రభ అనుబంధం (27.4.95)

